నాకో విచిత్రమైన అలవాటు ఉంది! టీ త్రాగందే నాకు రాత్రి పూట నిద్రపట్టదు!! నిద్రపోయే ముందు నా బెడ్ ప్రక్కన వున్న టీపాయ్ మీద పంచదార సీసా, ఓ చిన్న ఎలక్ట్రిక్ హీటర్, టీ పొడి, ఓ కప్పు స్టీల్ గ్లాసు, గాజు జార్‌లో నీళ్ళు మరియు ఓ చిన్న టీ కేటెల్ ఎప్పుడూ సిద్ధంగా వుంటాయి.

నాకున్న - అఫ్‌కోర్స్ కొన్ని చెడ్డ అలవాట్లలో ఒకటి - టీ త్రాగాక పాత్రలు ఎంగిలివి ఎక్కడవక్కడే చెల్లా చెదురుగా పడివుంటాయి. తెల్లారకనే టీ సామాగ్రినంతా సర్దివెళ్తాను. ఆఫీసు కెళ్ళే ముందు. బహుశా బ్యాచెలర్స్ జీవితానికి ఇదో నిదర్శనమేమో!?

దాదాపు అయిదు వందల గ్రాముల కెపాసిటీగల అందమైన గాజుసీసాలో తరచుగా సగం లేదా ముప్పాతిక భాగం వరకు పంచదార వుంటుంది. తెల్లారక నా చూపు పంచదార సీసాపై పడగా అది నిండుగా గండు చీమలతో వుంటుంది. నా నిద్రమత్తు పటాపంచలై పోతుంది ఆ దృశ్యాన్ని తిలకించగానే. రాత్రంతా పీడకలలతో తల మొద్దుబారగా తెల్లారగానే ఈ గొడవతో మనస్సు చివుక్కుమంటుంది.

ఆఫీసుకెళ్ళే హడావిడిలో ఏ కొద్దిగా సోమరితనం చూపించి టీపాయిని సర్దకుండా వెళ్ళి సాయంత్రం ఆఫీసు నుంచి గదిలోకి రాగానే చీమల బెటాలియన్...! ఏదో మూడవ ప్రపంచ యుద్ధానికి సన్నాహం అవుతున్నట్టు...?! పంచదార సీసా ఖాళీ...! ఇది మామూలు అయింది. ఓ డ్యూటీలా వాక్యూమ్ క్లీనర్ ఇంటి యజమానురాలి దగ్గర్నుంచి తీసుకొస్తుంటాను. ఆమె చీదరించుకుంటుంది. కాని కాదనకుండా ఇస్తుంటుంది. ఆ వాక్యూమ్ క్లీనర్‌తో కసిగా చీమలు క్లీన్...!

రోజులు గడుస్తున్న కొద్దీ నాకు ఈ గండు చీమలు తలనొప్పిగా తయారవుతున్నాయి. బజారులో దొరికే కీటక సంహారి మందులు వాడాను. చీమలు ఎక్కడ్నుంచి వస్తున్నాయో ఆ దారిలో మందు పొడి చల్లాను. లాభం లేకపోయింది. మార్గం మార్చి మళ్ళీ వస్తూండేవి. చచ్చిన వాటి సంఖ్య సరే సరి. మళ్ళీ ఇన్ని... అసంఖ్యాకంగా... ఎక్కడ్నుంచీ పుట్టుకొస్తున్నాయో అర్థం కావట్లేదు?! వీరి జనాభాను ఏ దేశంతో పోల్చాలి...? చైనాతోనా లేదా ఇండియాతోనా...? అర్ధం అయ్యేలా లేదు.




వీటి జనాభాకు. ఇవియే సాటి అని నిర్ధారణ చేసుకున్నాను.

చీమల మందుతో విసిగిపోయాను వీటి నివారణోపాయాలు, చిట్కాల కోసం పుస్తకాలపై ఎగబడ్డాను. ఒకటి అర తప్ప కనిపించలేదు నాకు చీమల నివారణ చిట్కాలు! ఆ చిట్కాలను కూడా వాడి చూశాను. గొప్పగా ఫలితం కానరాలేదు. రోజూ ఆఫీసర్‌చే చివాట్లు తినే పంక్చ్యుల్ ఉద్యోగి మొహంలా మారింది నా మొహం ఈ చీమల సమస్యతో! మిత్రుల సహాయం కోరగా నన్ను నవ్వుల పాలు చేశారు. దీన్ని అంతర్జాతీయ సమస్యలా తయారుచేశావు అని! అంతర్జాతీయ సమస్యలెప్పుడో సాల్వ్ అయ్యాయని నా ప్రాబ్లమ్ సాల్వ్ కాదని గొణుక్కున్నానే తప్ప పైకి అన్లేదు మిత్రులతో.

* * *

ఓ అర్థరాత్రి మంచి యవ్వనంలో వున్న వేసవి రాత్రి. ఎలక్ట్రిసిటీ వారి పుణ్యమా అంటూ గదిలో చిమ్మచీకటి. నాతోపాటు నా బెడ్డు కూడా చెమటలో చెమ్మగిల్లినప్పుడు, ఆ చెమటల వాసనలో ఓ కాంతిరేఖ నా మస్తిష్కంలో అందమైన అమ్మాయి చిరునవ్వులా తళుక్కుమంది.

చీకటిలో తడుముకుంటూ తలని గదిలో వున్న పిల్లర్‌కు బాదుకుంటూ గదిలో నుంచి బయటికెళ్ళాను. వసారాలో, చుట్టుప్రక్కల, ఇరుగు పొరుగు వారు బయట విద్యుచ్ఛక్తిని ( వాళ్ళను) తిట్టుకుంటుండగా వింటూ మా ఇంటి యజమానురాలి గడపకున్న కాలింగ్ బెల్ నొక్కాను అలవాటు ప్రకారం! అభిమానం అడ్డొచ్చింది కాని తలుపు తట్టాను.

"కవున్ హై!?" అంటూ లోపల్నించి మా ఇంటి యజమానురాల మధురమైన గొంతు. ఆమె ఒంటరిగా వుంటుందని నాకు బాగా తెలుసు. పైగా అందగత్తె. అంతకంటె పైగా ఆమె యుక్త వయస్కురాలు.

"రాజు!" నెమ్మదిగా పలికాను.

"క్యా హై?" విసుగుగా అడిగింది.

అర్ధరాత్రి... ఆమె ఒంటరిగా వుంటుందని తెలిసి కూడా అలా నేను నెళ్ళడం మర్యాదగా లేదని తెలుసు! కాని... ఏమి చేయను. మజ్‌బూరీ హై! మజ్‌బూరీ!!?

"టార్చిలైటు...!?" ఆమెకు వినిపించేలా అన్నాను అభ్యర్థిస్తూ.

ఆమె తలుపులు తీసింది నైటీలో వుంది. సెంట్ వాసన నా నాసికాపుటాల నెగురవేసింది. ఇంత అర్ధరాత్రి అయినా నీటుగా వుంది.

ఎమర్జెన్సీ లైట్ వెలుగుతోంది హాల్లో! హాల్లోని బీరువా తెరచి ఓ చిన్న ట్యూబ్ లైట్‌గల టార్చిలైట్ నాకిస్తూ అంది, 'డోన్ట్ కమ్ అగైన్!' అని కోపంతో దబాలున తలుపులు మూసేసుకుంది.

మళ్ళీ తలుపు తట్టాను. వెంటనే తలుపు తీసి "అవుర్ క్యాహై?" కోపంగా, కొంచెం గట్టిగానే అంది. ఇరుగు పొరుగున వున్న వాళ్ళు ఆమె గొంతు వినకపోలేదు.

"వెరీ సారీ!" అని అన్నాను లోతైన నా గుండె కుహరంలోంచి.

"నాట్ అగైన్!" అని అంది చిరునవ్వుతో. తలుపులు నెమ్మదిగా వేసింది.

నాకొచ్చిన ఆలోచనను వెంటనే అమలుపరచాలనే ఇంతగా ప్రయాస తీసుకున్నాను.

ఓ చిన్న గాజు జార్‌ను తీసుకుని అందులో మూడొంతుల పంచదార వేసి దాని మూత తీసేశాను. ఆ జార్‌ను ఓ వెడల్పైన సాసర్‌లో పెట్టి దాన్ని నీళ్ళలో నింపాను. చీమలు.. గండు చీమలు హద్దు దాటి వచ్చే ధైర్యం చేయకూడదని.

నా గది తలుపులకు గడియవేసి ఆ చీకటిలోనే ఎవ్వరిని దూషించకుండా టార్చిలైట్‌ను ప్రక్కలో పెట్టుకుని హాయిగా నిద్రబోయాను, నన్ను వేధిస్తున్న జాలం నుంచి బయటపడ్డాను.

* * *

హాయిగా నిద్రపట్టింది. తెల్లారుఝామున కళ్ళు తెరవగానే నేను చూసిన తొలి దృశ్యం - శత్రువుల కళేబరాలు దట్టంగా నీటిపై తేలుతూ కన్పించాయి. నాకు ప్రపంచాన్ని జయించినంత సంతోషం అయింది. ఇంక ఏమైనా చీమల దండు మిగిలి వుంటే వాటికో గుణపాఠంగా వుంటుందని ట్రాప్‌గా వాడిన పాత్రలను అలాగే యథాస్థితిలో పెట్టి ఆఫీసు కెళ్ళాను సంతోషంగా.

సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే గది తలుపులు తెరచి నేరుగా టీపాయ్ దగ్గరికి వెళ్ళాను. జార్ వైపు పరిశీలనగా చూశాను - ఒంటరిగా ఏకైక గండుచీమ ఆనందంతో తబ్బి ఉబ్బయిపోతూ వసంత గానంలో, మయూర నాట్యం చేస్తూ జార్‌లోని పంచదారను స్వాహా చేస్తుండడం చూసి నివ్వెరపోయాను.